సాక్షి అనంతపురం

శనివారం । 7 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.36,100

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36,100 పలికాయి.



టమాట కిలో రూ.36

అనంతపురం కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.36 పలికింది. కనిష్టం రూ.20, సరాసరి ధర రూ.30 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.9°/20.6°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి వాతావరణం నెలకొంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

అనంతపురం: ప్రపంచ మేధావి, ఆలోచనా పరుడు, తత్వవేత్త, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశ భవిష్యత్తుకు దిక్సూచి లాంటి వారని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని అనంతపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం సమరశీల పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆలిండియా బార్ అసోసియేషన్ మెంబర్ ఆలూరి రామిరెడ్డి, అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఉమాపతి, శ్రీనివాస్ రెడ్డి, జూటూరు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ

- రాజ్యాంగాన్ని రచించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్ల బదిలీ

అనంతపురం: జిల్లాలో 30 మంది ఏఎస్‌ఐలు, 79 మంది హెడ్ కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. నగరంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఒకే పోలీసు స్టేషన్‌లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిబ్బందిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. సీనియార్టీ నిబంధనలు అనుసరించి కోరుకున్న చోటుకి బదిలీ చేశారు. పట్టణాల్లో పనిచేసిన వారిని రూరల్ ప్రాంతాలకు, రూరల్ ప్రాంతాల్లో పనిచేసిన వారిని పట్టణ ప్రాంతాలకు పంపారు. అదే నియోజకవర్గం కాకుండా ఇతర నియోజకవర్గాల్లోని పోలీస్‌స్టేషన్‌లకు అవకాశం కల్పించారు. అనంతరం ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా బదిలీ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ డీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్కూళ్లలో మెగా పీటీఎం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్స్ (పీటీఎం) నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. మొత్తం 1,740 ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు జరగనున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు. హోలిస్టిక్ కార్డుల పేరుతో విద్యార్థులకు సంబంధించి సమగ్ర ప్రగతి కార్డులు తల్లిదండ్రులకు అందజేయనున్నారు. సమావేశాల సందర్భంగా స్కూళ్లలో విద్యార్థులతో పాటు టీచర్లు, పేరెంట్స్‌కు మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో మెనూలోనూ (ఒక్కరోజే) కొన్ని మార్పులు చేశారు. వైట్‌రైస్‌తో పాటు పప్పు లేదా పప్పుచారు, వెజిటబుల్ కర్రీ, స్వీట్ పొంగల్, చిక్కీ, రాగిజావ అందించనున్నారు. ఈ మెనూకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలకు విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

విజయవంతం చేయాలి : కలెక్టర్



అనంతపురం అర్బన్: మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను విజయవంతం చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశాలకు ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చూడాలన్నారు. రంగోళి, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు. సమావేశానికి హాజరయ్యే తల్లిదండ్రులకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. 1,740 పాఠశాలల డేటా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు, డీఈఓ, డీవైఈఓలు, ఎంఈఓలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, ఇతర అధికారులు పాల్గొనాలని ఆదేశించారు.

పల్లెలు మెల్లిమెల్లిగా ఖాళీ అవుతున్నాయి. కుటుంబాలకు కుటుంబాలే గ్రామాలు వదిలి వెళ్తుండటంతో జనం లేక కళతప్పుతున్నాయి. మారిన జీవన గమనంలో వివిధ అవసరాల నిమిత్తం పల్లెజనం పట్నం బాట పడుతున్నారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ ఉన్నదాంట్లోనే సర్దుకుపోతున్నారు.

జీవన గమనం.. పట్నం పయనం!



- ఉద్యోగ, ఉపాధి బాటలో పట్టణాలకు ప్రజలు
- పల్లెల కంటే పట్టణాల్లో 1.5 శాతం ఎక్కువ జనాభా
- పదేళ్లలో మున్సిపాలిటీల్లో 1.35 లక్షల మంది పెరుగుదల
- జనాభాకనుగుణంగా వసతులు లేక అవస్థలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రజల మొగ్గు పట్టణాల వైపే కనిపిస్తోంది. పట్టణాల్లో స్థిరపడేందుకే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. కొన్నేళ్ల క్రితంతో పోలిస్తే జిల్లాలోని పట్టణాల్లో జన సంఖ్య భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. పల్లెల నుంచి వలసలు ఎక్కువగా ఉంటున్నాయి. రూ.15 వేలు అంతకంటే తక్కువ వేతనం ఉన్న ప్రైవేటు ఉద్యోగులు సైతం పట్టణాల్లో స్థిరపడుతున్నారు. ప్రాథమిక స్థాయి నుంచే తమ పిల్లలను పట్టణాల్లో చదివించేందుకు ఎక్కువమంది తల్లిదండ్రులు వస్తున్నట్లు తేలింది.

పదేళ్లలోనే లక్షన్నర మంది..

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం వీటి పరిధిలో 6.27 లక్షల మంది మాత్రమే నివసించేవారు. తాజా అంచనాల ప్రకారం ఈ సంఖ్య సుమారు 7.72 లక్షలకు చేరింది. ఒక్క అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే 80 వేలకు పైగా జనాభా పెరిగినట్లు తేలింది. తాడిపత్రి, గుంతకల్లు మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

పల్లెల్లో ఉపాధి కరువై..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో ఎక్కువ మంది పట్టణాలకు వలస వస్తున్నట్టు తేలింది. ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువ మంది కూలి పనులకు వచ్చి పట్టణ ప్రాంతాల్లో స్థిరపడుతున్నారు. మరికొంతమంది పల్లెల్లో వ్యవసాయం చేసుకుంటూనే పిల్లల చదువుల కోసం పట్టణాలకు వస్తున్నారు. ఈ క్రమంలో అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి లాంటి పట్టణాల్లో ఇంటి అద్దెలు భారీగా పెరిగాయి. ప్రభుత్వాలు జనాభాకు అనుగుణంగా వసతులు కల్పించలేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

జిల్లాలోని మున్సిపాలిటీల్లో జనాభా వివరాలు

మున్సిపాలిటీ	2011 జనాభా	ప్రస్తుత జనాభా (అంచనా)
అనంతపురం	2,61,004	3,40,613
గుంతకల్లు	1,26,479	1,39,179
తాడిపత్రి	1,08,117	1,39,679
రాయదుర్గం	62,017	74,420
గుత్తి	37,814	38,230
కళ్యాణదుర్గం	32,328	39,737

సమస్యలెన్నో..

మున్సిపాలిటీల్లో జనాభా పెరుగుతున్న కొద్దీ సమస్యలు కూడా పెరుగుతున్నాయి. రోజురోజుకూ ప్లాస్టిక్ వాడకం ఎక్కువై అనర్థాలకు దారి తీస్తున్నాయి. చిన్న చిన్న మున్సిపాలిటీల్లో నిధులు సమకూరకపోవడంతో వ్యర్థాల నిర్వహణ చాలా అధ్వానంగా తయారైంది. ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇవ్వడం సాధ్యపడటం లేదు. ఆరు మున్సిపాలిటీల పరిధిలో 1.88 లక్షల గృహాలుండగా ఇంకా 80 వేల గృహాలకు నీటి కొళాయి కనెక్షన్ అందించాల్సి ఉంది. రోడ్లు, నీటి కొళాయిలు, డ్రైనేజీ వ్యవస్థలు కూడా సరిగా లేక పట్టణ పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వనరులు చాలడం లేదు

ప్రజలు పల్లెటూళ్ల నుంచి పట్టణాలకు రావడానికి ప్రధాన కారణం ఉద్యోగాలు, పిల్లల చదువులే. దీంతో పట్టణ జనాభా విపరీతంగా పెరుగుతోంది. అందుకు తగ్గట్టు మున్సిపాలిటీల్లో వసతులు సమకూర్చాలంటే ప్రస్తుతం ఉన్న ఆదాయ వనరులు సరిపోవడం లేదు. మున్సిపాలిటీలు ఆదాయ మార్గాలను చూసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాయి.

–నాగరాజు, మున్సిపల్ కమిషనర్, అనంతపురం

జీవనం కష్టంగా మారింది



నా భార్యతో కలిసి రెండున్నరేళ్ల క్రితం కళ్యాణదుర్గం వచ్చా. ప్రస్తుతం పట్టణంలోని శంకరప్ప తోట కాలనీలో నివాసముంటున్నాం. ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. పట్టణంలో ఇంటి బాడుగలు అధికమయ్యాయి. ఇటీవల ప్రభుత్వం కరెంటు చార్జీలను సైతం పెంచేసింది. మా లాంటి వారు జీవించాలంటే కష్టంగా ఉంది.

– మోహన్, శెట్టూరు

పల్లెల్లో పనులు లేవు..



మా స్వగ్రామం గుమ్మఘట్ట మండలం కలుగోడు. మొదట్లో గ్రామంలోనే ఉండేవాళ్లం. అక్కడ పనులేవీ దొరక్క పదేళ్ల క్రితం రాయదుర్గం పట్టణానికి వలస వచ్చాం. నా భార్య టైలరింగ్ పనులు చేస్తుంది. నేను హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. నాలాగే చాలామంది పల్లెలు వదిలి పట్టణాల్లో జీవనం సాగిస్తున్నారు.

– షమీవుల్లా, రాయదుర్గం

టీ కొట్టుతో జీవనం



మాది కణేకల్లు మండలం ఎర్రగుంట గ్రామం. నా చిన్నప్పుడే ఊరు వదిలి బళ్లారిలోని ఓ హోటల్‌లో కార్మికుడిగా చేరా. ఆదాయం సరిపోక రాయదుర్గం వచ్చి టీ కొట్టు ప్రారంభించా. 20 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నా. నా కుటుంబ సభ్యులు కూడా ఇక్కడే ఉంటున్నారు. పల్లెల నుంచి పట్నం చేరే వారి సంఖ్య క్రమంగా ఎక్కువైంది. అనేక కారణాలతో ప్రజలు గ్రామాలను వీడుతున్నారు.

– రంగప్ప, రాయదుర్గం

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకెళ్దాం

- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, పార్టీ నేతలు

అనంతపురం కార్పొరేషన్: అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకెళ్దామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. పార్టీ నేతలతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి అనంత ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం ద్వారానే ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు అందాయన్నారు. అంటరానితనం, కుల వివక్ష రూపుమాపడానికి పోరాటం చేయడమే కాకుండా వెనుకబడిన వర్గాల వారికి రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. స్వయం శక్తితో మహోన్నత స్థానానికి చేరిన అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేశారన్నారు. సమాజంలో అసమానతలు రూపుమాపడంలో భాగంగా ప్రజకు ఉచిత విద్య, వైద్యాన్ని అందించారన్నారు. ఏకంగా రూ.2.80 లక్షల కోట్లను ప్రజా సంక్షేమానికి వెచ్చించారని గుర్తు చేశారు.

లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నిలవదు..

దేశంలో ఎక్కడా లేని విధంగా మంత్రి లోకేష్ కనుసన్నల్లో నేడు రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని 'అనంత' విమర్శించారు. మద్యం, ఇసుక మాఫియా ఆగడాలు పెరిగిపోయాయని, దౌర్జన్యాలు, భూముల ఆక్రమణలు, దాడులు, హత్యలు ఇలా ఎన్నో దారుణాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాక్ స్వాతంత్ర్యాన్ని హరిస్తూ కేసులు నమోదు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపేందుకు ప్రజా పోరాటానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం మాట్లాడుతూ జగనన్న తన నాయకత్వంలో మహిళలకు రాజకీయంగా అవకాశాలు కల్పించారన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో 11 వేల మంది దళితులపై దాడులు జరిగినా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్ సీపీ టాస్క్‌ఫోర్స్ ప్రతినిధి రమేష్‌గౌడ్, ఆర్టీసీ రీజినల్ బోర్డు మాజీ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, ఎగ్గుల శ్రీనివాసులు, కొర్రపాడు హుస్సేన్ పీరా, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇసాక్, రహంతుల్లా, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, జావెద్, చింతకుంట మధు, రామయ్య, సాకే కుళ్లాయస్వామి, ఎంఎస్‌ఎస్ సాదిక్, తనీష, రాధాకృష్ణ, దాదు, అమర్‌నాథ్ రెడ్డి, రియాజ్, థామస్, శోభాబాయి, శోభారాణి, విజయశాంతి, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై మరో పిడుగు!

- రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు సర్కారు కసరత్తు
- జనవరి నుంచి చార్జీల భారం
- కొన్ని ప్రాంతాల్లో 10 శాతం పెంచేందుకు ప్రతిపాదన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సామాన్యులపై త్వరలో మరో పిడుగు పడనుంది. కూటమి సర్కారు ఇప్పటికే దీనిపై కసరత్తు చేసింది. ఇటీవల కరెంటు చార్జీలు పెంచి సగటు జీవులకు షాక్ ఇచ్చిన చంద్రబాబు.. వచ్చే ఏడాది కొత్త సంవత్సరం కానుకగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేందుకు యోచిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూముల విలువ ఎంత శాతం పెంచాలి అనే అంశాలపై కసరత్తు పూర్తయింది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే జనవరి 1 నుంచి కొత్త చార్జీలు అమలు చేయనున్నారు. ఇళ్లు, ఓపెన్ ప్లాట్‌లు, వెంచర్లలో స్థలాలు, భూముల కొనుగోలు చేసేవారిపై త్వరలో మోయలేని భారం పడనుంది.

స్థిరాస్తి రంగం కుదేలు..

కూటమి సర్కారు ఏర్పడ్డాక స్థిరాస్తి రంగం కుదేలైంది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో కొత్తగా వెంచర్లు వేసే నాథుడే కానరావడం లేదు. ఓపెన్ ప్లాట్‌లు కొనే వారు కరువయ్యారు. అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్‌లను అమ్ముకునేందుకు బిల్డర్లు నానా అవస్థలు పడుతున్నారు. గతంతో పోల్చితే రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా వచ్చే ఆదాయం 60 శాతం పడిపోయింది. ఇలాంటి తరుణంలోనూ రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

10 శాతం పైనే..

రిజిస్ట్రేషన్ అధికారుల సమాచారం మేరకు ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్ రుసుములో 10 శాతానికి పైగా పెరగనుంది. అర్బన్ ప్రాంతాల్లో ఈ రుసుం మరింత ఎక్కువగా ఉంటుంది. మొత్తమ్మీద 10 నుంచి 15 శాతం చార్జీలు పెరిగితే మాత్రం ఒక చిన్న ప్లాట్ కొనాలన్నా భారీ మొత్తం రిజిస్ట్రేషన్ చార్జీలకే చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే టీడీపీ నేతల బెదిరింపులతో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఎక్కడికక్కడ ఆగిపోయిన పరిస్థితి. ఇక చార్జీలు పెంచితే అసలు ఎవరూ ముందుకే రారని నిపుణులు భావిస్తున్నారు.

అనంతపురం జిల్లాలో..

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు	12
ఈ ఏడాది రాబడి లక్ష్యం	రూ.469.65 కోట్లు
అక్టోబర్ వరకూ వచ్చిన రాబడి	రూ.142.82 కోట్లు

ప్రతిపాదనలు సిద్ధం చేశాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొన్ని ప్రాంతాల్లో భూముల విలువ సవరణ చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అమల్లోకి వస్తాయి. ఇప్పుడిప్పుడే రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు ఆశాజనకంగా సాగుతున్నాయి. అక్టోబర్, నవంబర్ నెలల్లో రెవెన్యూ రాబడి పెరిగింది. అహుడా అప్రూవల్ ఉన్నవి మాత్రమే అయితే ఆదాయం రాదు. అందుకే మున్సిపల్ పర్మిషన్ లేని వాటికి కూడా రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం.

– భార్గవ్, జిల్లా రిజిస్ట్రార్

హవ్వా.. ఇదేం విచారణ!

- తల్లీ, బిడ్డ మృతిపై విచారణను మమ అనిపించిన కమిటీ
- బాధితులను అసలు విచారించని వైనం



భార్య, బిడ్డ మృతదేహాలను తీసుకెళ్తున్న మంజునాథ్ (ఫైల్)

అనంతపురం మెడికల్: అనంతపురం సర్వజనాస్పత్రిలో ఇటీవల జరిగిన తల్లీ,బిడ్డ మృతిపై విచారణ చేపట్టేందుకు ఏర్పాటు చేసిన కమిటీ తీరు సర్వత్రా విస్మయానికి గురి చేస్తోంది. కమిటీ సభ్యులు ఏకపక్షంగా వ్యవహరించడం చర్చనీయాంశమవుతోంది. కనీసం మృతురాలి భర్త, కుటుంబీకుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకోకుండానే విచారణ ప్రక్రియను మమ అన్పించడం అనుమానాలకు తావిస్తోంది.

గైనిక్ వైద్యుల నివేదికే సూపరింటెండెంట్‌కు!

సర్వజనాస్పత్రిలోని గైనిక్ వార్డులో ఈ నెల 2న రాయదుర్గం ప్రాంతానికి చెందిన జ్యోతి (30)తో పాటు పురిటి బిడ్డ మృతి చెందింది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవడంతో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు విచారణకు ఆదేశించారు. విచారణ కమిటీ సభ్యులుగా ప్రొఫెసర్లు డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ రవికుమార్, అనస్తీషియా వైద్యులు డాక్టర్ జగదీషాచార్యులను నియమించారు. వాస్తవంగా కమిటీ సభ్యులు మృతుల బంధువుల నుంచి కూడా వివరణ తీసుకోవాల్సి ఉంది. అయితే, ఇక్కడ మాత్రం కేవలం గైనిక్ వైద్యులు, స్టాఫ్‌నర్సులను విచారించి చేతులు దులుపుకున్నారు. పైగా గైనిక్ వైద్యులిచ్చిన నివేదికనే పొల్లుపోకుండా సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావుకు సమర్పించినట్లు తెలిసింది. దీన్ని బట్టి ప్రజల ప్రాణాల పట్ల అధికారులకు ఏ పాటి చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతోంది. ఈ విషయంపై కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

గుంతకల్లు: అయ్యప్ప మాలధారుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంతకల్లు జంక్షన్ మీదుగా శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్-కొట్టాయం (నం.07163) మధ్య ఈ నెల 20, 27 తేదీల్లో రైళ్లు నడుస్తాయన్నారు. ఆయా రోజుల్లో హైదరాబాద్ జంక్షన్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6.45 గంటలకు కొట్టాయం చేరతాయన్నారు. తిరిగి అక్కడి నుంచి 21, 28వ తేదీల్లో నడుస్తాయన్నారు. రాత్రి 9.45 గంటలకు కొట్టాయంలో రైళ్లు బయలుదేరి హైదరాబాద్ జంక్షన్‌కు మరుసటి రోజు అర్ధరాత్రి 12.30 గంటలకు చేరతాయన్నారు. బేగంపేట, లింగంపల్లి, శంకరపల్లి, వికారాబాద్, తాండూరు, యాద గిరి, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర, పాల్కాడ్, తిరుసూర్, ఎర్నాకులం టౌన్ మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

సర్కారు కక్ష.. ప్రజలకు శిక్ష

అనంతపురంలోని 37వ డివిజన్ రామ్‌నగర్‌లోని రేషన్ షాపు వద్ద శుక్రవారం మధ్యాహ్నం సరుకుల కోసం మహిళలు నిల్చున్న దృశ్యమిది. ఇక్కడొక్కటే కాదు.. జిల్లావ్యాప్తంగా నేడు ఇదే దుస్థితి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు ఇచ్చేవారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక కక్ష గట్టి ఎండీయూ వాహనాలను నిలిపివేయడంతో ప్రజలు నేడు రేషన్ షాపుల ముందు పడిగాపులు కాయాల్సి వస్తోంది. గంటలు తరబడి క్యూలో నిల్చోలేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు

– అనంతపురం కార్పొరేషన్:



క్లుప్తంగా

'దివ్యాంగ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సహకారమందిస్తాం'



కార్యక్రమానికి హాజరైన దివ్యాంగ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు

అనంతపురం: దివ్యాంగ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహకారం అందిస్తామని లీడ్ బ్యాంక్ మేనేజర్ నరసింగరావు తెలిపారు. రాయలసీమ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకర్లు, జిల్లా పరిశ్రమల అధికారులతో దివ్యాంగ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమాన్ని ఆర్డీటీలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నరసింగరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీధర్, అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులైన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు 52 మంది రూ.3.85 కోట్ల రాయితీ రుణానికి దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. పరిశ్రమలు స్థాపిస్తే ప్రభుత్వం తరఫున అందించే రాయితీ రుణాల గురించి వివరించారు.

ఫ్రాన్స్ అమ్మాయి.. గొల్లపల్లి అబ్బాయి



హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకుంటున్న సందీప్‌యాదవ్, ఆడ్ సవివ్

హిందూపురం: ప్రేమకు హద్దులు లేవని ఓ జంట నిరూపించింది. ఫ్రాన్స్ దేశస్తురాలైన ఆడ్ సవివ్, శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గొల్లపల్లికి చెందిన గొల్లసందీప్ యాదవ్ శుక్రవారం మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో హిందూపురంలో ఘనంగా జరిగింది. గొల్లపల్లికి చెందిన సామాన్య రైతు కేశప్ప, గంగమ్మ 11వ సంతానమైన సందీప్ యాదవ్ ఫ్రాన్స్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సీఎస్ఆర్‌లో సైంటిస్ట్‌గా స్థిరపడ్డారు. అక్కడ గూగుల్ సంస్థలో పనిచేస్తున్న ఫ్రాన్స్ దేశస్తురాలు ఆడ్ సవివ్‌తో పరిచయం కాస్తా ప్రేమగా మారింది. వీరి ప్రేమకు ఇరు కుటుంబాలు అంగీకారం తెలిపాయి. దీంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా వివాహం చేసుకున్నారు. సందీప్ యాదవ్ అన్న 'అక్షరమాల' శ్రీనివాసులు పెళ్లి పెద్దగా వ్యవహరించారు.

నిండుకున్న ఇన్సులిన్

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో తీవ్రంగా కొరత
- నెల రోజులుగా డ్రగ్ స్టోరేజీకి ఆగిన సరఫరా
- ప్రైవేటులో కొంటున్న మధుమేహ వ్యాధిగ్రస్తులు
- ప్రభుత్వానికి ముందుచూపు కరువై అవస్థలు

- కణేకల్లుకు చెందిన రాము షుగర్ వ్యాధితో బాధపడుతూ ఇన్సులిన్ కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. అయితే, అక్కడి సిబ్బంది ఇన్సులిన్ వాయిల్స్ ఖాళీ అయినట్టు చెప్పడంతో గత్యంతరం లేక బయట ప్రైవేటు మందుల దుకాణంలో కొనుగోలు చేశాడు.
- కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన వెంకటేశులు కొంతకాలంగా టైప్-1 మధుమేహంతో బాధ పడుతున్నాడు. రోజుకు రెండు సార్లు ఇన్సులిన్ తీసుకుంటున్నాడు. స్థానిక ఆస్పత్రిలో ఇన్సులిన్ అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేస్తున్నారు. ఈ రెండు చోట్లే కాదు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న చాలా ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి. 20 రోజుల నుంచి ఇన్సులిన్ సరఫరా నిలిచిపోయింది.

రాయదుర్గం: ఉమ్మడి జిల్లాలోని 90 ప్రాథమిక ఆస్పత్రులు, 15 సీహెచ్‌సీ, 7 ఏరియా, ఒక సర్వజన వైద్యశాల పరిధిలో షుగర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారు 11,645 మంది ఉన్నారు. ఆయా ఆస్పత్రుల్లో నెలలో సుమారు 1,400 నుంచి 1,500 ఇన్సులిన్ వాయిల్స్‌ను వ్యాధిగ్రస్తులకు ఇస్తున్నారు. టైప్-1, టైప్-2 షుగర్ బాధితులు తప్పనిసరిగా ఇన్సులిన్ తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి.

సరఫరా నిల్..

ఉమ్మడి అనంతపురం జిల్లాల్లోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రస్తుతం ఇన్సులిన్ నిల్వలు నిండుకున్నాయి. ఆయా ఆస్పత్రుల్లో అవసరాలను బట్టి మందుల ఇండెంట్‌ను ఏపీఎంఎస్ఐడీసీ స్టోర్‌కు పంపుతారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం నుంచి అనంతపురంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు సరఫరా అయ్యాక.. అక్కడి నుంచి ప్రత్యేక వాహనం ద్వారా ఆస్పత్రులకు మూడు నెలలకోసారి సరఫరా చేస్తారు. అయితే, ఉమ్మడి జిల్లాలోని పలు ఆస్పత్రులకు 20 రోజుల నుంచి ఇన్సులిన్ సరఫరా నిలిచిపోయింది. దీంతో షుగర్ వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటులో సొంతంగా డబ్బులు వెచ్చిస్తూ వాయిల్స్ కొంటున్నారు. ఒక్కోసారి రూ.600 నుంచి రూ.900 దాకా ఖర్చవుతోందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై డ్రగ్స్ స్టోర్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ సంప్రదించగా.. 20 రోజుల నుంచి వ్యాక్సిన్ సరఫరా కాలేదని ఆయన చెప్పారు. ఇండెంట్ పంపామని, త్వరలో సరఫరా అవుతాయని తెలిపారు.



కొరత లేకుండా చూస్తాం

ఆస్పత్రుల్లో ఇన్సులిన్ అవసరాలకు అనుగుణంగా సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌కు ఇండెంట్ పంపుతారు. 20 రోజులుగా బిజీగా ఉండడంతో దీనిపై దృష్టి సారించలేక పోయాం. దీనిపై డ్రగ్స్ స్టోర్ ఇన్‌చార్జ్‌తో మాట్లాడతా. కొరత లేకుండా సరఫరా చేసేలా చర్యలు చేపడతాం.
– ఈబీదేవీ, డీఎంహెచ్ఓ

ప్రశాంతంగా రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు

గుంతకల్లు/ గుత్తి: గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా మూడురోజులుగా జరుగుతున్న రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు కేవలం రన్నింగ్ స్టాఫ్ ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. డివిజన్‌లో మొత్తం 14,359 మంది ఓటర్లు ఉండగా.. 11,509 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 86.05 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నెల 12న ఓట్ల లెక్కింపు ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

నీటమునిగి వృద్ధుడి మృతి

పెద్దపప్పూరు: అవతలి ఒడ్డు నుంచి ఇవతలికి పశువులను తోలుకురావడానికి నీటికుంటలోకి దిగిన వృద్ధుడు లోతైన ప్రదేశంలో నీటమునిగి ఊపిరాడక మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. చాగల్లు గ్రామానికి చెందిన బోయ శ్రీరాములు (75) గురువారం సాయంత్రం పశువులను మేపడానికి చాగల్లు ప్రాజెక్టు లోతట్టు ప్రాంతంలోకి వెళ్లాడు. అక్కడ పశువులు ఓ నీటికుంట అవతలి ఒడ్డువైపు వెళ్లడంతో వాటిని తోలుకొచ్చేందుకు వెళ్తుండగా లోతైన ప్రదేశంలో మునిగాడు. ఈతకొడుతూ కొంత ముందుకు చేరుకోగలిగినా వయసు సహకరించకపోవడంతో అలసిపోయి ఊపిరాడక మృతి చెందాడు. పశువులు ఇంటికి చేరుకున్నా శ్రీరాములు కనిపించకపోవడంతో కుమారులు పలు చోట్ల గాలించారు. శుక్రవారం ఉదయం నీటికుంటలో శ్రీరాములు మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు పరుగున వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. శ్రీరాములుకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

ఆవుల దొంగల అరెస్ట్

తాడిపత్రిరూరల్: గన్నెవారిపల్లి కాలనీ చెందిన ఆవులను ఎత్తుకెళుతున్న ఆరుగురు దొంగలను అరెస్టు చేశామని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ శివగంగాధర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. గన్నెవారిపల్లి కాలనీలో ఉంటున్న కుళ్లాయప్పకు చెందిన రూ.1.20 లక్షల విలువైన నాలుగు ఆవులను అశోక్ లేలాండ్ వాహనంలో ఎత్తుకెళుతుండగా పట్టుకున్నామన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

యువకుడి బలవన్మరణం



రామాంజనేయులు (ఫైల్)

రాప్తాడురూరల్: మద్యానికి బానిసైన ఓ యువకుడు మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం పాములాయి గ్రామానికి చెందిన ఉప్పర రామాంజనేయులు (29) కూలి పనులు చేసుకుంటూ భార్య, కుమార్తె, తల్లిని పోషించేవాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. తాగి ఇంటికి వచ్చి ఏదేదో చెబుతూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన రామాంజనేయులు గురువారం రాత్రి భార్యతో కలిసి పడుకున్నాడు. తర్వాత కాసేపటికి లేచి చీరతో ఉరి వేసుకున్నాడు. గొంతు బిగుసుకున్నపుడు గట్టిగా అరవడంతో ఉలిక్కిపడి లేచిన భార్య గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారి సాయంతో కిందకు దింపేలోపే రామాంజనేయులు చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

స్థాన చలనం... అస్తవ్యస్తం

- ఖజానాలో ఇష్టారాజ్యంగా బదిలీలు

అనంతపురం అర్బన్: జిల్లా ఖజానా శాఖలో ఉద్యోగుల స్థానచలన (బదిలీల) వ్యవహారం అస్తవ్యస్తంగా మారింది. నియమిత సీటులో కనీసం మూడేళ్ల పనిచేయాలనే నిబంధనను పాటించకూండా అందరికీ మార్పులు చేశారు. అర్హులైన వారికి నాలుగేళ్లుగా పదోన్నతులు కల్పించలేదు. ఆరుగురు ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు ఇవ్వలేదు.

నిబంధనలకు విరుద్ధంగా...

జిల్లా ఖజానా శాఖలో మొత్తం 39 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 32 మందికి స్థానచలనం కల్పించారు. ఏడుగురు ఎస్‌టీఓ (సబ్ ట్రెజరీ అధికారుల)కు సీట్లు మార్చారు. 22 మంది ఎస్ఏ (సీనియర్ అకౌంటెంట్)లు ఉండగా 18 మందికి, 9 మంది జేఏ (జూనియర్ అకౌంటెంట్)లు ఉండగా ఏడుగురికి సీట్లు మార్చారు. స్థానచలనం పొందిన ఉద్యోగుల్లో చాలామంది ఒకే స్థానంలో మూడేళ్ల పనిచేసిన వారు తక్కువగా ఉన్నారు. మూడేళ్ల నిబంధనను పక్కనపెట్టి స్థానచలనం కల్పించారని చెబుతున్నారు. పరిపాలన (అడ్మినిస్ట్రేషన్) విభాగంలో ఇలాంటిదే చోటు చేసుకుందని అంటున్నారు. ఈ విభాగంలో ఏ2 సీటుకు నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల వ్యవహారాలు, మునిసిపల్, వాణిజ్య పనుల శాఖల పద్దులు కేటాయించారని పేర్కొంటున్నారు. తాజాగా జరిగిన స్థానం చలనంలో ఏ2 నుంచి మునిసిపల్, వాణిజ్య శాఖలను తొలగించారు. స్థానం చలనం కల్పించినప్పుడు యథావిధిగా విధులు ఉండాలే తప్ప.... కేటాయించిన వాటిలో కొన్ని విధులను తొలగించడం ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.



ఆదేశాల మేరకే మార్పులు

ఒక సీటులో మూడేళ్లు ఉంచాలనే నిబంధన ఉంది. అయితే పై అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అందరికీ సీట్లు మార్పు చేశాము. అడ్మినిస్ట్రేషన్ విభాగానికి బిల్లుల వ్యవహారం ఉండకూడనే ఉద్దేశంతో ఏ2 సీటుకు ఇప్పటి వరకు ఉన్న శాఖలను తీసివేశాం. సాంకేతిక కారణాల వల్ల ఉద్యోగులకు పదోన్నతులు, ఇంక్రిమెంట్లు కల్పించలేదు.
– సరళ విజయకుమారి, డిప్యూటీ డైరెక్టర్, ఖజానాశాఖ

పదోన్నతులకు నోచుకోక..

ఖజానా శాఖ పరిధిలో కొందరు ఉద్యోగులు అర్హత ఉన్నప్పటికీ నాలుగేళ్లుగా పదోన్నతికి నోచుకోలేదు. ఇంకొందరు ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనల మేరకు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 2020లోనే అర్హత పొందినా... ఇప్పటికీ ఇంక్రిమెంట్లు కలపలేదు. తద్వారా ఆ ఉద్యోగులు వారి సర్వీసులో చాలా నష్టపోతున్నారని ఆ శాఖ వర్గాలే చెబుతున్నాయి.

ఉద్యోగాలు హుష్‌కాకి

- 58 మంది ఎంపీహెచ్ఏల తొలగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన వైద్య ఆరోగ్యశాఖ

అనంతపురం మెడికల్: అధికారంలోకి వస్తే ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన చంద్రబాబు.. ఆచరణలో అమలు చేయకపోగా ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారు. తాజాగా వైద్య ఆరోగ్య శాఖలో 22 ఏళ్ల పాటు విధులు నిర్వర్తిస్తూ వచ్చిన మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (మేల్) (ఎంపీహెచ్ఏ-ఎం)ను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు డీఎంహెచ్ఓలకు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 58 మందిని తొలగిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఇ.భ్రమరాంబదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

తొలగింపు జాబితాలోని వారు వీరే..

అబ్దుల్ అజీజ్‌ఖాన్ (పుట్టపర్తి), కె.గంగిరెడ్డి (ఎన్‌పీ కుంట), ఎ.ధనుంజయరెడ్డి (అమడుగూరు), బి.శ్రీనివాసులు (ఓడీ చెరువు), ఎం.రమేష్‌కుమార్ (ఎన్‌పీ కుంట), ఎస్.బాబాఫక్రుద్దీన్ (రొళ్ల), బి.అశోక్‌కుమార్‌రెడ్డి (పరిగి), ఎం.సూర్యశేఖర్ (లేపాక్షి), ఎ.విజయభాస్కర్‌రెడ్డి (కుందుర్పి), ఎ.నాగరాజు (హేమావతి), ఎం.మురళీమోహన్ (రొద్దం), ఎల్.నాగరాజు (యల్లనూరు), పి.నాగేగౌడ్ (పేరూరు), పి.రవికుమార్ (గుడిబండ), డి.మల్లికార్జున(నీలకంఠాపురం), బి.కంబగిరి స్వామి (యాడికి), శేషగిరి (రాప్తాడు), ఎస్.జబీవుల్లా (ఎద్దులపల్లి), మునిరెడ్డి (నార్పల), బి.ప్రతాప్‌రెడ్డి (బ్రహ్మసముద్రం), ఎస్.లక్ష్మీనరసరెడ్డి (కంబదూరు), జె.లక్ష్మీనారాయణచారి (శెట్టూరు), కె.వాసు (గరుడుచేడు), వి.రామాంజనేయులు (కల్లుమర్రి), చౌడయ్య (రొద్దం)ను విధుల నుంచి తొలగించారు. ఇంకా సత్యనారాయణ (కంబదూరు), వెంకటరమణ (బొమ్మనహాళ్), శ్రీధర్ (గుండుమల), సుధాకర (వెంగలమ్మ చెరువు), శివరామకృష్ణారావు (విడపనకల్లు), పరశురాముడు, కె.ప్రభాకర్, హొన్నూరప్ప(రొద్దం), జె.విజయభాస్కర్‌రెడ్డి (చుక్కలూరు), సి.జయరాములు (గుంటూరు), వై.శ్రీధర్ (అమరాపురం), సి.గోవర్ధన (బొమ్మనహాళ్), ఎ.వెంకటరమణరావు (డీ హీరేహాళ్), ఎస్‌కే జాకీర్ హుస్సేన్ (నాగసముద్రం), జి.శ్రీనివాసులు (కుందుర్పి), టి.చంద్రశేఖర్ (కిష్టిపాడు), జి.సుబ్రమణ్యం (బి.పప్పూరు), ఎం సతీష్‌బాబు (కుందుర్పి), జె.రామచంద్ర (గుడిబండ), ఎస్ఎస్ నాగేంద్రకుమార్ (బొమ్మనహాళ్), ఎం.రమణానాయక్, ఎం.వెంకటరమణ, (గుడిబండ), ఎస్.మురళీకృష్ణ నాయక్ (బ్రహ్మసముద్రం), బి.నారాయణస్వామి (గుమ్మఘట్ట), కె.వెంకటసుబ్బయ్య (అగళి), జి.మదన్‌మోహన్(గరుడుచేడు), జేసీ నారాయణ నాయక్ (బ్రహ్మసముద్రం), కె.వెంకటేష్ నాయక్ (శెట్టూరు), వై శామ్యూల్ (నాగలాపురం), జి.నారాయణ (కంబదూరు), ఆర్‌కే రంగలాల్ (గుమ్మఘట్ట) తొలగించిన వారిలో ఉన్నారు.

మరో 85 మంది తొలగింపునకు రంగం సిద్ధం!

ఉమ్మడి జిల్లాలో మరో 85 మందిని రెండో దశలో తొలగింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెల్సింది. ఎంపీహెచ్ఏ(ఎం)లో 40 ఏళ్ల పైబడిన వారు లేకపోలేదు. ఉన్నఫళంగా వారిని తొలగిస్తే ఈ వయసులో విధులు ఏవిధంగా చేసుకుంటారనేది పెద్ద చర్చనీయాంశమైంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఉద్యోగ సంఘాలు భగ్గుమంటున్నాయి. ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి రోడ్డున పడేయడం సరికాదని చెబుతున్నాయి.

35 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న జేసీ శివ్ నారాయణశర్మ

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 35 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 32 మండలాలకు గానూ కూడేరు మినహా 31 మండలాల పరిధిలోని 35 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి 551 అర్జీలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు ముగుస్తున్నా ప్రజలకు చేసిందేమి లేకపోవడంతో ప్రజాప్రతినిధులు యథావిధిగా ఉకదంపుడు ఉపన్యాసాలకు, గత ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి రెవెన్యూ సదస్సులను వేదికగా చేసుకోవడంపై ప్రజలు మండిపడ్డారు.

సద్వినియోగం చేసుకోండి

అనంతపురం రూరల్: గ్రామాల్లోనే భూ, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ సూచించారు. శుక్రవారం అనంతపురం రూరల్ పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'మీ భూమి మీ హక్కు' నినాదంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ, వంక పోరంబోకు భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ప్రజలు నిర్భయంగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ హరికుమార్, ఎంపీడీఓ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎల్ఎంసీ పనులకు టెండర్లు

అనంతపురం సెంట్రల్: హెచ్‌ఎల్ఎంసీ పరిధిలోని మెయిన్ కెనాల్‌పై ఇటీవల కూలిపోయిన బ్రిడ్జీలు, గండ్లు, డిస్ట్రిబ్యూటరీలు తదితర 10 నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానించినట్లు హెచ్‌ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు పనులకు రూ.6.22 కోట్లు, మరో 5 పనులకు రూ.2 కోట్లు చొప్పున వేర్వేరుగా టెండర్లు పిలిచినట్లు వివరించారు.

సబ్సిడీపై గడ్డి పెంపకం


ఉరవకొండ: ఉపాధి హామీ పథకం కింద పశుపోషకులకు వంద శాతం సబ్సిడీపై గడ్డిపెంచుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం పశు సంవర్ధక శాఖ డీడీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జేడీ మాట్లాడారు. 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలన్నారు. పశుగణనను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గోకులం షెడ్లు, కృత్రిమ గర్భధారణ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బ్రూసెల్లోసిస్, సీపీఆర్ టీకాల కార్యక్రమం చురుగ్గా సాగుతోందన్నారు. పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించేలా పశుపోషకులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా నోడల్ అధికారి ఉమామహేష్, శర్మ, డాక్టర్ రాధిక, 16 మండలాల పశువైద్యాధికారులు, సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

ఆలస్యంగా నడిచిన ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు

గుత్తి: ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం 1.15 గంటలు ఆలస్యంగా నడిచింది. గుత్తి ఫోర్ట్ రైల్వే స్టేషన్‌కు ఉదయం 7.55 గంటలకు చేరుకోవాల్సి ఉండగా 1.15 గంటల ఆలస్యంగా అంటే 9.10 గంటలకు చేరుకుంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొందరు రైలు దిగి ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు. జక్కల చెరువు రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలు సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయింది. దీంతో ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణానికి ఆటంకం కలిగింది.

వధువు బంగారు నగలు మాయం

- మూడు గంటల్లో ఛేదించిన పోలీసులు
- మేకప్ చేయడానికి వచ్చిన బ్యూటీషియనే దొంగ



పామిడి: ఫంక్షన్ హాలులో వధువు బంగారు ఆభరణాలు అదృశ్యమయ్యాయి. ప్రత్యామ్నాయ నగలు అలంకరించి పెళ్లి కార్యక్రమం పూర్తి చేసిన తర్వాత పోలీసులు రంగంలోకి దిగి తమదైన శైలిలో విచారణ చేశారు. మూడు గంటల వ్యవధిలోనే బంగారును రికవరీ చేశారు. వధువును అలంకరించేందుకు వచ్చిన బ్యూటీషియనే దొంగ అని గుర్తించారు. వివరాల్లోకెళితే.... రామరాజుపల్లికి చెందిన విశ్వనాథరెడ్డి కుమార్తె పెళ్లి పామిడిలోని కోగటం ఫంక్షన్‌హాలులో జరిగింది. గురువారం రాత్రి రిసెప్షన్ అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం తలంబ్రాలు. వధువుకు సంబంధించిన 28 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. నగల మాయంపై పెళ్లికి వచ్చిన బంధుమిత్రులను ఆరా తీస్తే బాధపడతారేమోనని వధువు కుటుంబ సభ్యులు మిన్నకుండిపోయారు. ప్రస్తుతానికి ప్రత్యామ్నాయ నగలతో అలంకరించి పెళ్లి ఘట్టం ముగించారు. తర్వాత స్తబ్దుగా ఉండిపోయిన వధువు తండ్రిని గమనించిన స్నేహితులు రెక్కల చిన్న నాగిరెడ్డి ఆధ్వర్యంలో రామరాజుపల్లికి చెందిన రామశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి పోలీసులకు సమాచారమందించారు. స్పందించిన సీఐ యుగంధర్ తన సిబ్బందితో ఫంక్షన్ హాలుకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఆధారాలు లభించలేదు. దీంతో పెళ్లి కుమార్తె గదిని పరిశీలించారు. అక్కడ పైకప్పు పీఓపీ కొంత గ్యాప్ కనిపించింది. అక్కడేముందని చూడగా రెండు ఖాళీ నగల బాక్సులు కిందపడ్డాయి. ఇక్కడే ఏదో జరిగిందని అర్థమైంది. గదిలో ఎవరెవరు ఉన్నారు. ఎవరెవరు వచ్చి వెళ్లారు అని సీఐ ఆరా తీశారు. మేకప్ చేయడం కోసం బెంగళూరు నుంచి వచ్చిన బ్యూటీషియన్ తీరుపై అనుమానం కలగడంతో.. ఆమెను తమదైన శైలిలో విచారించడంతో అసలు విషయం బయటకొచ్చింది. తానే నగలు తస్కరించానని, వాటిని వాష్‌రూమ్‌లో ఫ్లష్‌ట్యాంకులో దాచి పెట్టిన నగలను చూపించింది. అనంతరం బ్యూటీషియన్‌పై సీఐ కేసు నమోదు చేశారు. మూడు గంటల వ్యవధిలోనే బంగారు నగలను రికవరీ చేసిన సీఐకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు శాఖ ప్రతిష్టను పెంచుదాం

- హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవంలో ఎస్పీ జగదీష్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: సమష్టిగా పనిచేసి పోలీసు శాఖ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేద్దామని ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 62వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ.. హోంగార్డుల సాయుధ ప్లటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించి, హోంగార్డులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పరేడ్ వాహనంపై వెళ్లి ప్లటూన్లను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ 1940లో వలంటీర్ వ్యవస్థగా ఏర్పాటైన హోంగార్డు వ్యవస్థ ప్రస్తుతం పోలీసు శాఖలో కీలకంగా మారిందన్నారు. పోలీసులతో సమానంగా సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు.

ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహణ

హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించారు. వడ్డీ లేకుండా హోంగార్డులకు ఇచ్చే రుణాలను పెంచాలని, ఉద్యోగ విరమణ పొందే రోజున ఇచ్చే మొత్తాన్ని పెంచాలని, ఐడీ కార్డులు జారీ చేయాలని విన్నవించారు. అనంతరం హోంగార్డులకు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు మెమెంటోలు ప్రదానం చేశారు.

విజేతల వివరాలు

- షాట్‌పుట్ : జిలానా బాషా, అన్వేష్ కమార్, ఖాసీం
- మహిళా విభాగంలో షాట్‌పుట్: షాహీనా బేగం, విజయలక్ష్మి భాయి, సరస్వతి
- 100 మీటర్ల రన్నింగ్ విభాగంలో: వీరనారప్ప, మారుతీబాబు, అన్వేష్ కుమార్, అరుణ, విజయలక్ష్మీబాయి, అరుణకుమారి
- లాంగ్ జంప్‌లో శివరామి రెడ్డి, అన్వేష్‌కుమార్, వీరనారప్ప, అరుణ, అరుణకుమారి, విజయలక్ష్మీబాయి

సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి

- జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ. చిత్రంలో సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉన్నప్పుడే పంచాయతీల్లో సమగ్రాభివృద్ధి సాధించడం సులభమవుతుందని ఉభయ జిల్లాల జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. 'స్థానికీకరణ – సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధన'లో భాగంగా రాష్ట్ర గ్రామ స్వరాజ్య అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) నిధుల వినియోగంపై అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవన్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఒక్కో మండలం నుంచి ఆరుగురు ఉద్యోగులు చొప్పున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63 మండలాలకు చెందిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్ఓలు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు హాజరయ్యారు. ముగింపు సభకు జెడ్పీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహించగా, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులతో పాటు స్థానికంగా ఆదాయ వనరులను పెంచుకునేందుకు గల అవకాశాలు అన్వేషించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ తరువాత అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అందులో ప్రాధాన్య క్రమంలో సమస్యలను గుర్తించి, వాటి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు, తాగునీటి అవసరాలు, అంగన్‌వాడీ, పాఠశాలలకు పక్కా భవనాలు, ప్రభుత్వ భవనాల మరమ్మతులు ఇలా.. అన్ని అంశాలనూ పరిశీలించి, వాటి పరిష్కారానికి నివేదికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను మండలాలకు వెళ్లి క్షేత్రస్థాయి అధికారులకు మళ్లీ శిక్షణ ఇచ్చి, తర్ఫీదునివ్వాలని సీఈఓ వెంకటసుబ్బయ్య ఆదేశించారు. శిక్షణ తరగతులకు పరిశీలకురాలిగా శ్రీకాళహస్తి నుంచి వచ్చిన రూపారాణి అనే అంశాల గురించి వివరించారు.

క్లుప్తంగా

రేపు నిచ్చెనమెట్లు ప్రారంభం

అనంతపురం కల్చరల్: అనంత స్వాతంత్ర్య సమరయోధుడు పప్పూరు రామాచార్యుల విగ్రహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నిచ్చెనమెట్లను మేయర్ వసీం ప్రారంభించనున్నారు. శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో పప్పూరు రామాచార్యులు స్మారక కమిటీ కన్వీనర్ నాగలింగయ్య మాట్లాడుతూ.. స్థానిక జడ్జి బంగ్లా ఎదురుగా ఉన్న పప్పూరు రామాచార్యుల విగ్రహం వద్ద నిచ్చెనమెట్లు లేకపోవడంతో స్మారక కమిటీ తరపున అభ్యర్థించగానే ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమానికి మేయర్‌తో పాటూ పలువురు ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరవుతారన్నారు.

పంపనూరులో నేడు కల్యాణోత్సవం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కల్యాణోత్సవంలో భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొనాలని సూచించారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి పరిశ్రమలే ముఖ్యం


మాట్లాడుతున్న డీఐసీ జనరల్ మేనేజర్ శ్రీధర్

అనంతపురం సెంట్రల్: జిల్లా సమగ్రాభివృద్ధికి పరిశ్రమలే ముఖ్యమని డీఐసీ జనరల్ మేనేజర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం నగరంలో కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో మెగా ఎంఎస్ఎంఈ కస్టమర్ ఔట్‌రీచ్ పోగ్రాం నిర్వహించారు. ఎంఎస్ఎంఈలోన్‌ల మంజూరు, పంపిణీలో బ్యాంకులు తీసుకున్న డిజిటల్ ఇనిషియేటీవ్‌పై వివరించారు. సకాలంలో బకాయిలను చెల్లించడం, క్రెడిట్ రేటింగ్, ఆర్థిక క్రమశిక్షణ ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లారెన్స్, ఎల్‌డీఎం నర్సింగరావు, డీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖరరెడ్డి, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బవసరాజ్, ఎంఎస్ఎం సులబ్‌హెడ్ కార్తీక్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి 'హోండా న్యూ అమేజ్'


కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: ప్రముఖ హోండా కార్ల కంపెనీ నూతన మోడల్ ఆల్ న్యూ అమేజ్ కారును మార్కెట్‌లోకి విడుదల చేసింది. శుక్రవారం నేషనల్ పార్కు సమీపంలో ప్రీమియం హోండా షోరూంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రవిశంకర పాండ, డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్లు ప్రియాంక, తిరుమలేష్, జీఎస్ఎస్ వైభవ్, ప్రముఖ న్యాయవాది జూటూరు సుధాకర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై కారును ప్రారంభించారు. ప్రీమియం హోండా అధినేత ఎస్.నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. మూడో జనరేషన్ వాహనమైన ఆల్ న్యూ అమేజ్ అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇంటీరియల్, భద్రత విషయంలో 6 ఎయిర్‌బ్యాగ్స్, ఏడీఏఎస్ లాంటి ప్రత్యేక వసతులు ఉన్నాయన్నారు. మ్యానువల్, ఆటో మేటిక్‌లలో మూడు వేరియంట్లలో లభిస్తుందన్నారు. ప్రారంభ ధర రూ.7.99 లక్షలు ఉందని వివరించారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే భావిభారత పౌరులు


మాట్లాడుతున్న జిల్లా సివిల్‌జడ్జి శివప్రసాద్ యాదవ్

అనంతపురం ఎడ్యుకేషన్: నేటి విద్యార్థులే భావిభారత పౌరులు. చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా కష్టపడి చదువుకుని మంచిస్థాయికి చేరుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి జి.శివప్రసాద్ యాదవ్ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు 'డ్రగ్స్ అబ్యూజింగ్ చట్టం'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్ అబ్యూజ్ కింద నమోదయ్యే కేసుల వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. ఈ కేసులు నమోదైన తర్వాత, విద్యార్థులు, యువత భవిష్యత్తు ఎలా అంధాకరమవుతుందో తెలియజేశారు. విద్యార్థులు చదువుపట్ల, సామాజిక సమస్యల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, అడ్వకేట్ హరికృష్ణ, కళాశాల ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..


ఉదయం ఏడు గంటల సమయంలో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు

శీతాకాలం వచ్చేసింది. తెల్లవారుజామున రహదారులపై పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం ఏడు గంటలు దాటినా ఎదురుగా ఏ వాహనం వస్తుందో ? ఏ మనిషి వస్తున్నాడో? అని తెలుసుకోలేనంతగా మంచు కురుస్తోంది. శుక్రవారం ఈ మధ్యకాలంలో ఎప్పుడూ లేనంతగా కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించారు. వృద్ధులు ఉదయాన్నే బయటకు రావడానికి జంకుతున్నారు. గ్రామాల్లో చలిమంటలు వేసుకుని రక్షణ పొందుతున్నారు.

– ఆత్మకూరు:


పొలంలో మంచు కురుస్తున్న దృశ్యం

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య


అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు, ఆర్టీసీ మాజీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల


రాప్తాడులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతపురం/అనంతపురం సిటీ/అనంతపురం కార్పొరేషన్/ అనంతపురం ఎడ్యుకేషన్/అనంతపురం టవర్‌క్లాక్/ఆత్మకూరు/రాప్తాడు: కుల వ్యవస్థ, అంటరానితనం, అస్పృశ్యత వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సృష్టి ఉన్నంత వరకు ధ్రువతారగా వెలుగొందుతుంటారని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ దాసరి వాసంతి సాహిత్య అన్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట గల అంబేడ్కర్ విగ్రహానికి ఆయన వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్ పాల్గొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఈఓ వెంకటసుబ్బయ్య, ఏఓలు, సిబ్బంది నివాళులర్పించారు. నగరపాలక సంస్థలో అంబేడ్కర్ చిత్రపటానికి మేయర్ వసీం నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ నాగరాజు, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, అనిల్‌కుమార్ రెడ్డి, అబూసలేహ, బాలాంజనేయులు, నాయకులు కుళ్లాయస్వామి, రామచంద్ర, కాకర్ల శీన, తదితరులు పాల్గొన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యమేలుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు మండిపడ్డారు. ఆత్మకూరులో మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల, ఎంపీపీ హేమలత, సర్పంచ్ వరలక్ష్మితో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలో దళితులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని తెలిపారు. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసులు కూడా అధికార పార్టీ నేతలు చెప్పు చేతుల్లో ఉండి పనులు చేస్తున్నారని విమర్శించారు. రాప్తాడులోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నల రవికుమార్, నాయకులు బాల నాగేంద్ర, టిచర్ లింగన్న, పసుపుల నరసింహ గౌడ్, సత్యనారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో..

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత నివాళి అర్పించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్‌బాబు, న్యాయశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. శ్రీరాములు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

అంబేడ్కర్‌ను దేశంలో కొన్ని దుష్టశక్తులు ఒక కులానికి పరిమితం చేస్తున్నారని ఏబీవీపీ నాయకులు మండిపడ్డారు. అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో..

ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షులు సాకే హరి ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, చిరంజీవి, ఉమామహేశ్వరి, సుగమంచి శ్రీనివాసులు, ఈశ్వరయ్య, రామకృష్ణ, వెంకటేష్, సుమలత, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

జై బీమ్ రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో..

జై భీం రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ చందునాయక్, వెంకటేష్ పాల్గొన్నరు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ జేఏసీ ఆధ్వర్యంలో..

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కోడవండ్ల ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి జరిగింది.

ఆర్‌ఈఎఫ్ ఆధ్వర్యంలో..

ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర అధ్యక్షతన రాజ్యాంగ నిర్మాత విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నేరిమెట్ల ఎల్లన్న, ఎండి నాగభూషణం,రామకృష్ణ, రామాంజనేయులు, ఓబులేసు, సూర్యనారాయణ పాల్గొన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో ఓబులేసు, మలేష్, మనోజ్, రామన్న, శివలింగ మూర్తి, చలపతి, రామూర్తి, సురేష్, ఈశ్వరయ్య, ప్రకాష్, అనిల్ పాల్గొన్నారు.

డ్రోన్లతో తనిఖీలు

అనంతపురం: అనంతపురం త్రీ టౌన్, రాప్తాడు, ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆయా పోలీసులు డ్రోన్లతో తనిఖీలు చేపట్టారు. రాప్తాడు శివారు ప్రాంతాల్లో 9 , ఇటుకలపల్లి పరిధిలో ఎస్కేయూ, ఇటుకలపల్లి, ఆకుతోటపల్లి ప్రాంతాల్లో 2 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు.

అయ్యప్ప ఉత్సవాలు ప్రారంభం


గరుడ పక్షుల రాకను వీక్షిస్తున్న స్వాములు

అనంతపురం కల్చరల్: శబరిమల నుంచి అనంతకు విచ్చేసిన సన్నిధానం ప్రధాన అర్చకుడు రాజీవ్‌తంత్రి శిష్యబృందం ఆధ్వర్యంలో స్థానిక చెరువుకట్టపై అయ్యప్ప స్వామి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 10వ తేదీ వరకు రోజుకు ఒక ఉత్సవం చొప్పున వేడుకలు జరుగుతాయి. శుక్రవారం ఉదయం గణపతి హోమం, జెండా స్థాపన, శ్రీభూతబలి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా సాగాయి. దశాబ్దాలుగా అయ్యప్ప ఉత్సవాల సమయంలో ఏటా వచ్చే విధంగా రెండు గరుడ పక్షులు అయ్యప్ప ఆలయంపై వాలినప్పుడు పెద్ద ఎత్తున స్వామియే శరణం అయ్యప్ప అంటూ గురుస్వాములు శరణుఘోషతో పరిసరాలను మార్మోగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతమ్ మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం నగర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. కళాకారులు కళారూపాలను ప్రదర్శించడానికి సిద్ధమైనట్లు తెలిపారు. వందలాది మందికి సాముహిక భిక్ష ఏర్పాటు చేశారు.



వానరాల సమాలోచన!

నగరంలోని వడియంపేట వద్ద శుక్రవారం ఉదయం వానరాలు బ్రిడ్జిపై గుంపుగా చేరి చాలాసేపు అలాగే కూర్చుండి పోయాయి. ఏదో ఆలోచిస్తున్నట్లుగా కనిపించాయి. వాహనదారులు వాటిని ఆసక్తిగా గమనించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

ప్రజా ప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా?


మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: గ్రామాల్లో ఏ సమస్యలు వచ్చినా పరిష్కరిస్తారనే నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా గెలిపించారు. కాని ప్రజా ప్రతినిధులకు అధికారులు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా అవమానిస్తున్నారని ఎంపీపీ హేమలత మండిపడ్డారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో 17 పంచాయతీలకు 16 మంది వైఎస్సార్‌సీపీ పార్టీకి చెందిన వారు సర్పంచ్‌లుగా గెలిచారన్నారు. 11 మంది ఎంపీటీసీలకు 10 మంది వైఎస్సార్‌సీపీ పార్టీకి చెందిన వారే ఉన్నట్లు పేర్కొన్నారు. అధికారులు మాత్రం ప్రభుత్వం నిర్వహిస్తున్న అధికార కార్యక్రమాలకు కనీస సమాచారం ఇవ్వకుండా పక్కన పెట్టి అవమానిస్తున్నారని మండిపడ్డారు. కొంతమంది సర్పంచులు, ఎంపీటీసీలు ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. అధికారుల తీరు మాత్రం మారలేదని తెలిపారు. ప్రజా ప్రతినిధులైన సర్పంచులు, ఎంపీటీసీలను పక్కన పెట్టడం సరికాదని హితవు పలికారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాల వద్ద విద్యుత్ సబ్‌స్టేషకు అనుమతి తీసుకువచ్చారని గుర్తు చేశారు. గతంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆ సబ్‌స్టేషన్‌లకు భూమిపూజ కూడా చేశారని తెలిపారు. గతంలో భూమి పూజ చేసిన వాటికి మళ్లీ భూమి పూజ చేయడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ప్రొటోకాల్ పాటించకపోవడంతో ప్రజా ప్రతినిధులతో కలసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు.

సత్యనారాయణ స్వామికి డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధన చేసిన వైష్ణవ సత్యనారాయణ స్వామికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ డి.మురళీధర్ రావు పర్యవేక్షణలో 'నాన్ ఎమ్‌క్యామ్-ఎమ్‌క్యామ్ స్పెసిఫిక్ ప్రి-అండ్ పోస్ట్ మెటాస్టాటిస్ క్యాన్సర్ సెల్ డెటెక్షన్ యూజింగ్ క్వాంటమ్ డాట్స్: ఏ థిమాటిక్ అప్రోచ్' అనే అంశంపై పరిశోధన చేశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామానికి చెందిన వైష్ణవ సత్యనారాయణ ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధుల్లో ఉండరా?


ఏఎంసీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇందులేఖ లేరని సూపరింటెండెంట్‌కు చెబుతున్న సిబ్బంది

అనంతపురం మెడికల్: అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమకు కేటాయించిన వార్డుల్లో విధులను ఎందుకు నిర్వర్తించరని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు సంబంధిత విభాగాధిపతులను ప్రశ్నించారు. శుక్రవారం రాత్రి సర్వజనాస్పత్రిలోని ఎమర్జెనీ మెడిసిన్, ఏఎంసీలను ఆకస్మిక తనిఖీ చేశారు. మొదటగా ఎమర్జెన్సీ మెడిసిన్‌లోని క్షతగాత్రులను పరిశీలించిన ఆయన అక్కడున్న పీజీను ఆరా తీశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వాంతన అని పీజీ సమాధానం ఇచ్చారు. ప్రమాద కేసులున్నప్పుడు రోగులకు అందుబాటులో ఉండాలని కదా అని ఆరా తీశారు. అనంతరం అక్యూట్ మెడికల్ కేర్(ఏఎంసీ)ను తనిఖీ చేశారు. అక్కడ డ్యూటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇందులేఖ అందుబాటులో లేరు. వైద్యురాలు ఎక్కడున్నారని సూపరింటెండెంట్ ఆరా తీయగా క్యాజువాలిటీలో ఉన్నారని పీజీ సమాధానం ఇచ్చారు. చివరకు సంబంధిత హెచ్ఓడీలను సూపరింటెండెంట్ ఫోన్ చేసి అసిస్టెంట్ ప్రొఫెసర్లను విధుల్లో ఉంచేలా చూడాలన్నారు.

బాధ్యతను బరువుగా భావించొద్దు

అనంతపురం సిటీ: 'అన్ని శాఖల్లోకెల్లా జిల్లా పరిషత్ కీలకమైంది. రెండు జిల్లాలకూ ఇదొక్కటే ఉమ్మడి శాఖ. ఇక్కడ పని చేసే భాగ్యం అందరికీ రాదు. అటువంటి అదృష్టం మీకొచ్చిందంటే మీపై చాలా బాధ్యత ఉంటుంది' అంటూ ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బదిలీల ప్రక్రియ ముగిసింది. చాలా మంది వివిధ ప్రాంతాల నుంచి జెడ్పీకి బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో సీఈఓ జి.వెంకటసుబ్బయ్య అధ్యక్షతన తొలిసారి ఉద్యోగులతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా ఉద్యోగులందరూ పరిచయం చేసుకున్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. జెడ్పీలో పని చేసే ఉద్యోగులు విధి నిర్వహణలో హుందాగా వ్యవహరించాలని సూచించారు. కార్యాలయ వేళల్లో అనవసరంగా బయట తిరగడం, కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయడం సరికాదని హితవు పలికారు. అనంతరం పలువురు ఉద్యోగులు తమ జెడ్పీలోని సమస్యలను చైర్‌పర్సన్, సీఈఓ దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా కంప్యూటర్లు, ప్రింటర్లు పాతబడిపోవడంతో తరచూ మొరాయిస్తున్నాయని తెలిపారు. పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరగా.. చైర్‌పర్సన్, సీఈఓ సానుకూలంగా స్పందించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాలసదనం తనిఖీ

అనంతపురం సెంట్రల్: బుడ్డప్ప నగర్‌లోని బాలసదనం, శిశుగృహలను డీఎల్ఎస్ఏ కోర్టు జడ్జి శివప్రసాద్ యాదవ్ శుక్రవారం తనిఖీ చేశారు. చైల్డ్ బెగ్గింగ్ ఎగైనెస్ట్ డే, పిల్లల క్రమశిక్షణ, చదువు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ కేశవ నాయుడు

రాప్తాడు: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు వేదిక కావాలని అనంతపురం ఆర్డీఓ కేశవ నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మేపర్తిలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. రైతులు, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొనే సమస్యలు, దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. ఈ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాసుపుస్తకంలో చేర్పులు, మార్పులు ఏమైనా ఉంటే సరి చేసుకోవాలన్నారు. సాగులో ఉన్న ప్రతి రైతుకూ పట్టాదారు పాసుపుస్తకం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ రూప్లానాయక్, రూరల్ సబ్ రిజిష్టర్ ఇస్మాయిల్, తహసీల్దార్ విజయకుమారి, ఆర్ఐ కరుణాకర్, సర్వేయర్ రామాంజినేయులు, వీఆర్వోలు సాయికుమార్, మనోజ్, సర్పంచు ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు గాండ్లపర్తిలో..

రాప్తాడు: భూ సమస్యలకు పరిష్కారం చూపడం కోసం మండలంలో ఈనెల 7వ తేదీ మండలంలోని గాండ్లపర్తి గ్రామంలో రెవెన్యూ సదస్సు ఉంటుందని తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు.

కమనీయం.. కల్యాణం


సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం శుక్రవారం కమనీయంగా జరిగింది. సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకుని నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో ఉన్న మంజునాథేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రతినిధి మఠం బసవరాజ స్వామి ఆధ్వర్యంలో పలువురు అర్చకులు ఆలయంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు చేపట్టారు. అనంతరం అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తజనంతో కలిసి ఉభయ దేవేరులతో సహా సుబ్రమణ్యేశ్వర ఉత్సవ విగ్రహాలకు కల్యాణ మహోత్సవాన్ని ఎదుర్కోలు, తలంబ్రాలు, మాంగళ్యధారణ వంటి వాటితో సంప్రదాయరీతిలో జరిపించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

రేపు రెడ్డి వివాహ పరిచయ వేదిక

రాప్తాడు రూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న అనంతపురం రూరల్ పాపంపేటలోని సంఘం కార్యాలయంలో ఉచితంగా 'రెడ్డి వివాహ పరిచయ వేదిక' ఏర్పాట్లు చేస్తున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రొద్దం సురేష్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, కార్యదర్శి దుబ్బ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు మంత్రి విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ వివాహ పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు. రెడ్డి కులస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమ్మాయి, అబ్బాయిలకు సంబంధించి బయోడేటా తీసుకుని రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 94415 75641, 93902 84296, 94907 67224 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దివ్యాంగుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

రాప్తాడు: ఈనెల 15వ తేదీ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరగబోయే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సాకే జానకీ రామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని దివ్యాంగులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు జయమ్మ, వరాలమ్మ, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, రామ్మోహన్, ప్రసాద్, పార్వతి, రామాంజినమ్మ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వినోదం అవసరం


రాస్ సంస్థకు టీవీ అందిస్తున్న మహిళా ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: మానసిక వైకల్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి వినోదం అవసరమని గిల్డ్ ఆఫ్ సర్వీస్ ప్రతినిధులు అన్నారు. స్థానిక రామ్ నగర్‌లోని రాస్ (రాష్ట్రీయ సేవా సమితి) సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల కేంద్రానికి రూ.26 వేలు విలువ చేసే టీవీని రాస్ సూపర్‌వైజర్ ఫర్హానాకు అందించారు. ఈ సందర్భంగా మహిళా ప్రతినిధులు ఎంఆర్ వాణి, అరుంధతి, అరుణశ్రీ, లలిత తదితరులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లగా మానసిక వికలాంగులకు అండగా నిలుస్తూ సేవాభావంతో పనిచేస్తున్న టీచర్లు, ఆయాల సేవలను అభినందించారు. పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ఈనెల చివరి వారంలో బహుమతులనిచ్చి ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: క్రీడలు జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పారిస్ పారా ఒలింపిక్స్ అథ్లెటిక్స్ కోచ్ సురేష్ కుమార్ అన్నారు. గ్లోబల్ విద్యా సంస్థల రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆర్డీటీ స్టేడియంలో గత రెండు రోజుల నుంచి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి సురేష్ కుమార్, మేజర్ మురళీధర్ రావు (రిటైర్డ్ ఆర్ట్స్ కళాశాల, ప్రిన్సిపాల్) ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. క్రీడలతో క్రమశిక్షణ, ఏకాగ్రత, అంకితభావం, పట్టుదల, నిబద్ధత అలవడుతాయన్నారు. గ్లోబల్ విద్యా సంస్థల విద్యార్థులు ఇలాంటి మరెన్నో క్రీడా కార్యక్రమాల్లో పాల్గొని రాణించాలన్నారు. రన్నింగ్ రేస్, మార్చ్‌ఫాస్ట్, రైఫిల్ షూటింగ్, డంబుల్ డ్యాన్స్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్లోబల్ అకడమిక్ డీన్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్స్ ఆదిలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.